పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 108. అల్ కౌసర్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 3 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

కౌసర్ స్వర్గంలోని ఒక సెలయేరు. దాని నీరు త్రాగిన తర్వాత మనిషి సంతోషం, హాయి అనుభవిస్తాడు. ప్రపంచంలో కౌసర్ అంటే అపారమైన మేలు. అంటే లాభమే లాభం. శుభాలే శుభాలు. కాబా ప్రపంచంలో అల్లాహ్ కారుణ్యం శుభాల కేంద్రం. సకల ప్రపంచానికీ కాబా వలన ప్రయోజనం చేకూరుతోంది. కాబా జనంతో నిండి ఉంటే ప్రపంచమూ జనంతో నిండి ఉంటుంది. కాబా నిర్మానుష్యమయిపోతే సకల ప్రపంచం సకల సృష్టి నిర్మానుష్యమయి పోతుంది. కాబా వల్లనే ఈ ప్రపంచం నడుస్తోంది.

అల్లాహ్ ఈ సూరాలో హజ్రత్ ముహమ్మద్ (స)తో ఇలా అంటున్నాడు. “ఖురైష్‌లు కాబాలో దైవారాధన చేయడం లేదు. పేదలకు సహాయమూ చేయడం లేదు. అందుచేత కాబాను నీకు, ముసల్మానులకు అప్పచెబుతున్నాను. కాబాకు మీరే హక్కుదారులు. మీరు అల్లాహ్‌ను ఆరాధిస్తున్నారు. పేదలకు సహాయం కూడ చేస్తున్నారు.” ఇందులో దైవప్రవక్త (స) మరియు ముసల్మానులకు విజయం లభించనున్నదనే శుభవార్త ఉంది. ఇంకా తిరస్కారులు, ముష్రికులలకు అపజయం లభించనున్నదనే భవిష్యవాణి ఉంది.

آیَاتُهَا 3 | 108 سُوْرَةُ الْكَوْثَرِ مَكِّيَّةٌ | رُكُوْعُهَا 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

إِنَّآ أَعْطَيْنٰكَ الْكَوْثَرَ ﴿1﴾

فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ ﴿2﴾

إِنَّ شَانِئَكَ هُوَ الْأَبْتَرُ ﴿3﴾ ع 1 3 33

### 108. అల్ కౌసర్

**ఆయత్‌లు : 3** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) ఓ ప్రవక్తా! మేము నీకు కౌసర్‌ను ప్రసాదించాము. (2) నీవు నీ ప్రభువును ఆరాధించు మరియు ఖుర్బానీ ఇవ్వు. (3) నిస్సందేహంగా నీ శత్రువే వారసుడు లేనివాడు మరియు నామరూపాలు లేనివాడు.

1 – 3 వాక్యాలు

కూల్చివేయబడిన చెట్టు ఎండి, మట్టిలో కలిసిపోయినట్లు ముహమ్మద్ తన జాతి నుండి వేరుపడిపోయారు అని, ఖురైషులు చెప్పేవారు. ఇటువంటి ఆందోళనకర పరిస్థితులలో అల్లాహ్, ప్రవక్తను ఊరడిస్తూ అన్నాడు, “ఓ ముహమ్మద్! మీరు తప్పక విజయులవుతారు. మేము మీకు కౌసర్‌ను ప్రసాదించాము. ఒకనాడు దైవగృహానికి (కాబాకు) మీరు బాధ్యతాయుతులు అవుతారు. మీకు విజయం, సహాయం లభిస్తాయి. కౌసర్ అంటే మేలు, శ్రేయస్సు, గౌరవం, సాఫల్యం. దైవప్రవక్త (స) కుమారుడు హజ్రత్ ఇబ్రాహీం (రజి) బాల్యంలోనే మరణించగా తిరస్కారులు, ముష్రికులు పరమానందం చెంది ఇక ఇప్పుడు ఈయన పేరెత్తేవాడు ఎవరూ లేరు. ఈయన గారు మరణించాక ఈయన ధర్మం (మతం) కూడ నామరూపాల్లేకుండా పోతుంది అని చెప్పుకోసాగారు. దీనికి జవాబుగా అల్లాహ్

సెలవిస్తున్నాడు, "ఓ ప్రవక్తా! మేము మీకు కౌసర్‌ను ప్రసాదించాము. అబూజహల్ అబూలహబ్ పేర్లు పలికేవారు ప్రపంచంలో ఇప్పుడు ఎవరూ లేరు కాని హజ్రత్ ముహమ్మద్ (స) అనుచరులు అభిమానులు కోట్ల సంఖ్యలో ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నారు."

అనేక హదీసుల ద్వారా రుజువుపర్చబడిన విషయం. కౌసర్ స్వర్గంలోని ఒక సెలయేరు. అది ఆయన (స)కు అనుగ్రహించబడుతుంది. హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనంలో ఉంది, "ఆయన (స) ప్రశ్నించారు, 'కౌసర్ అంటే ఏమిటో తెలుసా?" దైవం మరియు దైవప్రవక్తకే బాగా తెలుసు అని సహాబాలు చెప్పారు. "అది ఒక సెలయేరు. దాన్ని అల్లాహ్ నాకు స్వర్గంలో ప్రసాదించాడు" అని మహాప్రవక్త (స) వివరించారు. (సహీహ్ ముస్లిం – హ.నెం.607)